లక్ష్యం చేరుకోవడం ఎలా?

- 12న ఉచిత సెషన్

సిటీబ్యూరో:నేషనల్ యూత్ డే పురస్కరించుకుని 12న 'యూత్-ద ఫ్యూచర్ ఆఫ్ ఇండియా' సెషన్‌ను యూ అండ్ మీ సంస్థ నిర్వహించనున్నది. గోల్ సెట్టింగ్..గోల్ క్లారిటీ అంశాలపై ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వీరేందర్ ప్రసంగించనున్నారు. ఈ సెషన్ ఉచితంగా ఉంటుంది. యువత భవిష్యత్తులో ఎలా రాణించాలి? వారికున్న అవకాశాలు ఏమిటీ? అవరోధాలను ఎలా అధిగమించాలి? లక్ష్యాన్ని ఎలా నిర్దేశించుకోవాలి? విజయాన్ని ఎలా పొందాలి? తదితర అంశాలపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. బాగ్‌లింగంపల్లిలోని యూ అండ్ మీ సంస్థ కార్యాలయంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3:30 వరకు కార్యక్రమం కొనసాగనున్నది. ఆన్‌లైన్‌లో కూడా రాత్రి 8 నుంచి 9 వరకు జూమ్‌లో సెషన్ ఉంటుంది.

కేసు విచారణ నిలిపివేత

హైదరాబాద్, జనవరి 10, నమస్తే తెలంగాణ: పరువు నష్టం కేసులో నటి ముంచు లక్ష్మిపై నమోదైన కేసు విచారణను నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ మాధవి దేవి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఒక టీవీ చర్చావేదిక కార్యక్రమానికి సంబంధించి జర్నలిస్టు సాంబశివరావు ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా 2018లో కేసు నమోదైంది. ఇది హైదరాబాద్ 14వ ఏసీఎంఎం కోర్టులో విచారణ జరుగుతున్నది. దీనిని కొట్టేయాలని మంచు లక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. కేసు నమోదుకు ప్రాథమిక ఆధారాలు లేవని పిటిషనర్ లాయర్ చెప్పారు. సినిమా పరిశ్రమను అవమానించారన్న కేసును ఎదుర్కోవడంలో భాగంగా కౌంటరు కేసు పెట్టారని వివరించారు. ఇది 2018 నాటి కేసని, మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని ఏపీపీ గణేశ్ ప్రతివాదన చేశారు. అనంతరం హైకోర్టు.. కేసు విచారణను 4 వారాల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మరో మూడు చోట్ల..

560 ఎకరాల్లో ఏర్పాటుకు కసరత్తు

ఇప్పటికే పూర్తి కావొచ్చిన రెండు లే అవుట్లు

హెచ్ఎండీఏ లే అవుట్లు

- త్వరలోనే భూ యజమానులకు 60, హెచ్ఎండీఏ వాటాగా 40 శాతం కేటాయింపు
- గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సమీకరణ పథకం విజయవంతం

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా ముందుకెళ్తున్న హెచ్ఎండీఏ గ్రేటర్ చుట్టూ శివారు ప్రాంతాల్లో కొత్త లే అవుట్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీం)లో భాగంగా రైతుల నుంచి భూములను సేకరించి వారి అంగీకారంతోనే హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం లే అవుట్లను అభివృద్ధి చేస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం 2017లో భూ సమీకరణ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే మొట్ట మొదటిసారిగా రెండు చోట్ల భారీ లే అవుట్లను ఏర్పాటు చేయగా, మరో మూడు ప్రాంతాల్లో భూములను సేకరించే పనిలో హెచ్ఎండీఏ నిమగ్నమైంది.

నిబంధనలకు అనుగుణంగా..

మొదటగా రంగారెడ్డి జిల్లా శ్రీశైలం జాతీయ రహదారిలో ఉన్న కందుకూరు మండల పరిధి లేమూర్‌లో 87 ఎకరాల్లో, కొత్తూరు మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామ రెవెన్యూ పరిధిలోని 94 ఎకరాల్లో లే అవుట్లను అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకున్నది. నిబంధనలకు అనుగుణంగా విశాలమైన రోడ్లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నది. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. త్వరలోనే రైతుల వాటాగా 60 శాతం కింద ఎకరానికి 1742 గజాలను కేటాయించి, మిగిలిన 40 శాతం వాటా కింద 1161 చదరపు గజాలను అభివృద్ధి చేసిన లే అవుట్‌లో హెచ్ఎండీఏ తమ ల్యాండ్‌బ్యాంకుగా పెట్టుకోనున్నది.

త్వరలో మరో 3 చోట్ల..

భూ సమీకరణ పథకంలో భాగంగా మొదటి దశలో రెండు చోట్ల లేఅవుట్‌లను అభివృద్ధి చేయగా, రెండో దశలో దండు మల్కారంలో 300 ఎకరాలు, బోగారంలో 110 ఎకరాలు, ప్రతాపసింగారంలో 150 ఎకరాల్లో హెచ్ఎండీఏ భారీ లే అవుట్లను వేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసి, రైతుల నుంచి అంగీకారాన్ని సేకరించే పనిలో ఉన్నది. ఈ పథకాన్ని గత కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టి భూ యజమానులు భూ సమీకరణ పథకం కింద భూములను ఇచ్చేందుకు అనుకూలమైన వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ హెచ్ఎండీఏ పరిధిలో భూ సమీకరణ పథకం కింద లే అవుట్‌లను అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా హెచ్ఎండీఏ లక్ష్యం నెరవేరుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

భూ సమీకరణ వేగవంతం చేయాలి

- హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ దానకిశోర్

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీం) కార్యకలాపాలు వేగవంతం చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం లుంబినీ పార్క్ వద్ద ఉన్న బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్, ల్యాండ్ పూలింగ్ విభాగాల అధికారులతో ప్రత్యేకంగా పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మహానగరం జీహెచ్ఎంసీ పరిధి దాటి శివారు ప్రాంతాలు విస్తరిస్తున్నదన్నారు. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లోనూ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రణాళిక మెరుగైన రీతిలో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఓఆర్ఆర్ చుట్టూ కొత్తగా పట్టణీకరణ జరిగేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. శివారు ప్రాంతాల్లో చిన్న చిన్న లే అవుట్లు కాకుండా భారీ ఎత్తున వందలాది ఎకరాల్లో లే అవుట్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూసమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీం) కార్యకలాపాలు వేగవంతం చేయాలని దానకిశోర్ సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ బీ.ఎల్.ఎన్.రెడ్డి, భూసమీకరణ పథకం ప్రత్యేకాధికారి ఎస్. విశ్వనాథ్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి

అల్వాల్ భూదేవినగర్‌లోని మహా బోధి స్కూల్ ఆవరణంలో ఉన్న గద్దర్ సమాధిపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

– మల్కాజిగిరి, జనవరి 10

జలమండలి నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డిని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎండీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు రాంబాబు, నారాయణ, జయరాజ్, అక్తర్, రామచంద్రారెడ్డి, లక్ష్మీ నారాయణ, జమీల్, జంగయ్య, ఎల్లయ్య, నర్సింగరావు , రాజయ్య తదితరులు ఉన్నారు.

– సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ)

కిమ్స్‌లో స్మార్ట్ వార్డ్స్

కొండాపూర్ కిమ్స్‌లో డోజీ ఏఐ ఆధారిత 'స్మార్ట్ వార్డ్స్'ను వైద్యశాల చైర్మన్, ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్, రీజినల్ మెడికల్ డైరెక్టర్, డాక్టర్ సుధీర్ విన్నమల తదితరులు పాల్గొన్నారు.

– మాదాపూర్, జనవరి 10

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బడిబయట పిల్లలను గుర్తించాలి

సిటీబ్యూరో: జిల్లాలో బడి బయట పిల్లలను గుర్తించి వెంటనే వారిని బడిలో చేర్పించే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమంపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాశ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజ, కార్మిక శాఖ అధికారి శ్యాంసుందర్, జిల్లా అభివృద్ధి అధికారి అక్కేశ్వరరావు, డీఐవో శ్రీకళ, డీఈవో రోహిణి, ఎన్జీవోలు, జువైనల్ హోమ్, ప్రభుత్వ చైల్డ్ హోమ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్

ఈ- కామర్స్‌తో వ్యాపార రంగంలో నిలదొక్కుకోవచ్చు

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్ చంద్రశే ఖర్

బాలానగర్, జనవరి 10 : ఈ- కామర్స్‌తో వ్యాపార రంగంలో నిలదొక్కుకోవచ్చని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఎంఎస్ఎంఈ ఆడిటోరియం హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్స్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ ఫ్లో) అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ప్రతినిధులతో పాటు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరక్టర్ ఎంవీ సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏదైనా ప్రొడక్ట్‌ను మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే మార్కెటింగ్ ఎంతో ముఖ్యమని సూచించారు. వస్తువులను బయటకు వెళ్లకుండా కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ప్రజలంతా ఈ -కామర్స్‌ను(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్) ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్పత్తులు తయారు చేస్తున్న పారిశ్రామికవేత్తలు ముందుగా ఈ- కామర్స్‌ను సంప్రదించి వాటి ద్వారా సేల్స్‌ను పెంచుకుంటున్నారన్నారు. తయారు చేసిన ఉత్పత్తులను సకాలంలో సేల్స్ చేయడం ప్రధానమన్నారు. కార్యక్రమంలో అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రతినిధి ప్రతిభ యాదవ్, గ్లోబల్ సెల్లింగ్ వాల్మార్ట్ ప్రతినిధి అవేస్ బుకారీతో పాటు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి: పరశురామ్

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీని గాంధీభవన్‌లో బుధవారం కలిసిన ఆయన వినతి పత్రం అందజేశారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని, ఈ న్యాయమైన డిమాండ్ సాధనకు సహకరించాలని కోరారు.

కాపీ కొట్టి.. పట్టుబడ్డాడు

- తల్లిదండ్రులకు తెలుస్తుందని భయంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

దుండిగల్, జనవరి 10: పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి విషయం తల్లిదండ్రులకు తెలుస్తుందేమోనన్న భయంతో ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కళాశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో గాజులరామారానికి చెందిన దేవాదీనం కుమారుడు డారేల్ జాయ్(20) సీఎస్ఎం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఓ పరీక్షకు హాజరైన డారేల్ జాయ్.. కాపీ కొడుతూ పట్టుపడ్డాడు. కళాశాల యాజమాన్యం విషయాన్ని తన తల్లిదండ్రులకు చెబుతుందోమోనన్న భయంతో అదే భవనంలోని నాలుగో అంతస్తు పై నుంచి దూకేశాడు. వెంటనే కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తదితరులు అతడిని చికిత్స కోసం సూరారంలోని ఓ వైద్యశాలలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎస్ రద్దుకు ఫిబ్రవరి 16న సమ్మె

సుల్తాన్‌బజార్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు కోసం ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సుభాష్ లాంబా ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు.

మాదకద్రవ్యాల పట్టివేత

జూబ్లీహిల్స్, జనవరి 10: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూట్ వాచ్ నిర్వహించి తనిఖీలు చేశారు. 20 గ్రాముల ఎండీఎంఏ 8 బ్లాస్టులు, 5.010 కిలోల గంజాయితో పాటు 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీవోది క్రియాశీలక పాత్ర

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్
- ఎల్బీ స్టేడియంలో ఘనంగా స్పోర్ట్ మీట్

సుల్తాన్‌బజార్, జనవరి 10. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు, సర్కారుకు వారధిగా ఉండాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీ స్టేడియంలో 9వ స్పోర్ట్ మీట్, గేమ్స్ -2024ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్,జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన టీఎన్జీవో సంఘానికి ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు జిల్లా శాఖ అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. వీరోచిత పోరాటం చేసి కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు స్థూపాన్ని నిర్మించడంతో పాటు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఘనత టీఎన్జీవో సంఘానికే దక్కుతుందన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని నేటి తరం యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఎనిదేండ్లుగా ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో స్పోర్ట్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించి.. ఉద్యోగులు ఆరోగ్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ యెట్టం సదానంద్ క్రికెట్ మెమోరియల్‌తో పాటు ఇతర ఇండోర్ గేమ్‌లను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వివరించారు.గురువారం జరిగే ఫైనల్ క్రికెట్‌తో స్పోర్ట్‌మీట్ ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌జీఈఎఫ్ అధ్యక్షుడు సుభాష్ లాంబా, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటనారాయణ, టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, కార్యదర్శి చంద్రశేఖర్ గంగపుత్ర, సభ్యులు ఉమాదేవి, శైలజ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సీమా ముజీబ్, నాలుగో తరగతి కేంద్ర సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, కార్యదర్శి గంగాధర్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కురాడి శ్రీనివాస్, మురళీరాజ్, నరేశ్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, సభ్యులు సుజాత, గీత, వెంకట్‌రెడ్డి, శంకర్, ముఖీం ఖురేషీ, శ్రీధర్ నాయుడు, ఈఎన్టీ యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు, పీఆర్‌వో సయ్యద్ జహంగీర్ అలీ, ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్, మహ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో టీఎన్జీవో స్పోర్ట్ మీట్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, టీఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ముజీబ్ హుస్సేనీ

పతంగుల సందడి..

ప్రతిసారిలాగే.. ఈ ఏడాది కూడా అందమైన, విభిన్న రకాల పతంగులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. చిత్రంలో పతంగులు, మాంజాల తయారీలో నిమగ్నమైన ధూల్‌పేట వాసులు

ఉద్యోగం పేరుతో మోసం..

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకుల వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఐబీఎం కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిందితుడు కండోజు ప్రణయ్ కుమార్ నగరానికి చెందిన ఓ బాధితుడికి వాట్సాప్ సందేశం పంపించాడు. అది నమ్మిన బాధితుడు నిందితుడికి ఫోన్ చేసి వివరాలు అడిగాడు. దీంతో ప్రణయ్ కుమార్ ఉద్యోగం కావాలంటే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.3.3 లక్షలను ముట్టజెప్పాడు. అనంతరం ప్రణయ్ కుమార్ తన మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు మోసగాడిని అరెస్ట్ చేశారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను కాపాడుకోవాలి

ఖైరతాబాద్, జనవరి 10 : దేశం, రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉన్నదని వక్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ 1959లో దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించారని, తొలుత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లో ప్రారంభించారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా 78, 79 అధికరణలను అమలు చేయాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి మాట్లాడుతూ సర్పంచ్‌ల ఎన్నికల య్యేంత వరకు ప్రస్తుత సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగించాలన్న డిమాండ్లు న్యాయబద్ధమైనవని, వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి, ఉపాధ్యక్షులు మల్లేశ్, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ప్రదీప్ బాధ్యతలు

సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అర్బన్ ఫారెస్ట్ విభాగం డైరెక్టర్‌గా ఎస్వీవీ ప్రదీప్ కుమార్ శెట్టి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో స్పెషల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్వర్తులు జారీ చేసింది. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ ఆయనకు అర్బన్ ఫారెస్ట్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు అర్బన్ ఫారెస్ట్ విభాగం డైరెక్టర్‌గా ఉన్న బి.ప్రభాకర్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.